సాక్షి
కాకినాడ
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



కమనీయం భీమనాథుని కల్యాణం

ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు.

8లో



'నన్నయ'కు రూ.20 కోట్ల నిధులు

ఆదికవి నన్నయ యూనివర్సిటీకి ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ (పీఎం - ఉష) పథకంలో రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

డెల్టాలకు 8,600 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,550, మధ్య డెల్టాకు 1,650, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.95 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

నూతన రథంపై రేపు సత్యదేవుని ఊరేగింపు



అన్నవరం: సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను గురువారం నూతన రథంపై ఊరేగించనున్నామని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ మంగళవారం తెలిపారు. రూ.34 లక్షలతో నిర్మించిన ఈ నూతన రథాన్ని రథసప్తమి పర్వదినాన గత శుక్రవారం ప్రారంభించిన విషయం విదితమే. అదే రోజు ఈ రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగించాలని అనుకున్నారు. అయితే, ఆ రథాన్ని నడిపిస్తూ ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చే వీలు లేకపోవడంతో క్రేన్‌తో లోపలకు చేర్చారు. ఈ క్రమంలో ముహూర్తం మించిపోవడంతో ఆ రోజు కొత్త రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరగలేదు. అందువలన గురువారం ఉదయం 10 గంటలకు ఈ ఊరేగింపు నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు నీడ కోసం ఏర్పాటు చేసిన గ్రీన్ షెడ్‌లు రథం కన్నా తక్కువ ఎత్తు ఉండటంతో వాటిని మరో రెండడుగులు పైకి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రథాన్ని ఆలయ ప్రాంగణంలో నైరుతి వ్రత మండపం వద్ద నిలిపి ఉంచారు.

ఎస్పీ పరామర్శ

కాకినాడ క్రైం: ప్రమాదవశాత్తూ రైఫిల్ మిస్ ఫైర్‌లో బుల్లెట్ గాయం తగిలిన చింతూరు సీఆర్‌పీఎఫ్ ఏఎస్సై పి.చరణ్‌ను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మంగళవారం పరామర్శించారు. కాకినాడ జీజీహెచ్‌లో ఎస్ఐసీయూలో ఉన్న చరణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. క్షతగాత్రుడికి అందుతున్న వైద్య సేవలపై జీజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ బి.అనితను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చరణ్‌కు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌ను కోరారు.

మనోహరం.. జనహోరం



అశేష జన సందోహం మధ్య సాగుతున్న రథోత్సవం



జనం వద్దకే జగమేలు స్వామి

- వైభవంగా లక్ష్మీనృసింహుని రథోత్సవం
- సోదరి గుర్రాలక్కకు చీర.. సారె సమర్పణ
- తిలకించి... పులకించిన భక్తులు
- మధ్యాహ్నం 2-05 గంటలకు రథోత్సవం
- తీరం భక్తజన సంద్రం
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- దర్శనానికి బారులు తీరిన వైనం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ తదితరులు

సాక్షి అమలాపురం/ సఖినేటిపల్లి: శ్రీదేవి... భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి అధిరోహించిన రథాన్ని లాగే వారిదే అదృష్టం... చూసే కన్నులదే భాగ్యం అన్నట్టుగా రథయాత్ర కనుల వైకుంఠంగా సాగింది. భక్తవరదుడు అంతర్వేది శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో ఐదవ రోజు మంగళవారం భీష్మ ఏకాదశి పర్వదినాన మాడవీధుల్లో రథయాత్ర నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అసంఖ్యాకమైన భక్తుల గోవింద నామస్మరణలు, నరసింహస్వామికి జై అనే నినాదాల మధ్య ఈ రథయాత్ర నయన మనోహరంగా సాగింది. సోమవారం అర్ధరాత్రి కనువిందు చేసిన స్వామివారి కల్యాణం, మంగళవారం గ్రామ వీధులను వైకుంఠ పథాలుగా మార్చిన రథోత్సవం, ఆ రెండు పర్వాలకు నడుమ భీష్మ ఏకాదశి వేకువ జామున సాగరస్నానం, అనంతరం ఆలయంలో స్వామి దర్శనం. ఇన్ని ఘట్టాలతో భక్తజన హృదయాలు ఆనందంతో ఉప్పొంగాయి.

రథం వద్ద మొక్కులు చెల్లించుకున్న భక్తులు

భక్తుల గోవిందనామస్మరణల మధ్య మధ్యాహ్నం 2-05 గంటలకు రథయాత్ర ప్రారంభమయింది. మంగళ వాయిద్యాలతో, అర్చకుల వేదమంత్రాలతో నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి పల్లకిలో రథం వద్దకు తోడ్కొని వచ్చారు. పల్లకి నుంచి అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్లను రథంపైకి అధిరోహింపచేశారు. భక్తులు రథానికి అరటిగెలలు, గుమ్మడికాయలు కట్టించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మొగల్తూరుకు చెందిన ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కొబ్బరికాయలు కొట్టి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. మెరకవీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపువీధి మీదుగా పదహారు కాళ్ల మంటపం వద్దకు చేరుకుంది. మార్గ మధ్యంలో గుర్రాలక్కకు స్వామి తరపున చీరె, సారె ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఇచ్చారు. సుమారు మూడు గంటల పాటు సాగిన రథయాత్ర నయనానంద భరితంగా సాగింది. వందల మంది భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటెత్తారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి, ఎండోమెంట్స్ డీసీ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎం.విజయరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు రథోత్సవంలో పాల్గొన్నారు.

సాగర తీరాన పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



అంతర్వేదిలో నేడు

ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకూ సుప్రభాత సేవ, శ్రీస్వామివారి తిరువారాధన, బాలభోగం, వార్షిక అభిషేకాలు, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలకు అనుమతి ఇవ్వనున్నారు. సాయంత్రం 4గంటలకు గజ వాహనంపైన, రాత్రి 8 గంటలకు పొన్న వాహనంపైన శ్రీస్వామి గ్రామోత్సవం అర్చకులు నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుంచి 7గంటల వరకూ శ్రీస్వామివారి సన్నిధిని శుద్ధి చేసేందుకు దర్శనాలను నిలిపి వేయనున్నారు. రాత్రి 7 గంటలకు పాలమూరు వారి సత్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నపర్వత మహానివేదన చేయనున్నారు. భీష్మ ఏకాదశి రోజు నుంచి ఉపవాసం ఉంచి మరునాడు ద్వాదశి తిధి నాడు విరమణ చేసే అర్చకులు స్వామికి అన్న దర్శనం చేయడం సంప్రదాయంగా వస్తోంది.

భక్త జన సంద్రం

సోమవారం అర్ధరాత్రి 12-29 గంటలకు కల్యాణోత్సవం ముగిసిన అనంతరం భీష్మ ఏకాదశి పర్వదినాన సాగర స్నానం చేసేందుకు వచ్చిన భక్తులతో తీరం జనసంద్రమైంది. ఇసుక వేస్తే రాలనంతగా జనం తీరానికి వచ్చి పుణ్యస్నానాలు చేశారు. కొందరు తలనీలాలు సమర్పించగా, మరికొంతమంది పిండ ప్రదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామి దర్శనానికి వెళ్లారు. తెల్లవారు జామున మూడు గంటలకు మొదలైన స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాత్రి వరకు దర్శనాల కోసం క్యూ లో భక్తులు బారులు తీరారు.

రత్నగిరి.. భక్తజలధి



విశ్రాంతి షెడ్డులో సేద తీరుతున్న భక్తులు

- భీష్మ ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులు
- సత్యదేవుని దర్శించిన 70 వేల మంది
- 7,100 వ్రతాలు.. రూ.80 లక్షల ఆదాయం

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా రత్నగిరి భక్తజనసంద్రమే అయ్యింది. భక్తవరదుడైన సత్యదేవుని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు పోటెత్తారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకూ సుమారు 70 వేల మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, సాధారణ దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని ఆలయాన్ని సోమవారం వేకువన ఒంటి గంటకు తెరచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. తెల్లవారు జామున రెండు గంటల నుంచే వ్రతాల నిర్వహణ ప్రారంభించారు. స్వామివారి వ్రతాలాచరించే భక్తులతో వ్రత మండపాలు నిండిపోవడంతో నిత్య కల్యాణ మండపంలో సైతం వ్రతాలు నిర్వహించారు. దీంతో ఉదయం స్వామివారి నిత్యకల్యాణం 11.30 గంటలకు ప్రారంభించారు.

లక్ష చేమంతి పూజ

ఉదయం ఏడు గంటలకు స్వామివారికి 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. అలాగే ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకూ స్వామివారికి లక్ష చేమంతి పూలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేద పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమండ్ర శర్మ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దండిగా రాబడి

భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా దేవస్థానానికి రూ.80 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

వ్రతాలు 7,100 జరిగాయి. సుమారు 6 వేల మంది భక్తులకు పులిహోర, దద్ధోజనం, చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. రామాలయం వద్ద ఉన్న విశ్రాంతి మండపంలో పలువురు భక్తులు సేద తీరారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా స్వామివారిని దర్శించుకున్నారని ఆయన తెలిపారు. భక్తులకు నీడ కోసం పలుచోట్ల షామియానాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

అలరించిన పుష్పాలంకరణ

భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుని ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణం, ధ్వజస్తంభం వద్ద, అనివేటి మండపం వెలుపల రంగురంగుల పరిమళభరిత పుష్పాలతో చేసిన అలంకరణ భక్తులను అలరించింది. సప్తగోకులం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడు, భీష్ముడు, అర్జునుడి ఫ్లెక్సీల వద్ద ఫొటోలు దిగడానికి భక్తులు పోటీ పడ్డారు. పలువురు కళాకారులు సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించారు.



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ

పేదింట పెళ్లికి ప్రభుత్వ సాయం

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా సాయం అందజేత
- జిల్లాలో 367 జంటలకు లబ్ధి
- రూ.2.66 కోట్ల ఆర్థిక సాయం



వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ, కలెక్టర్ కృతికా శుక్లా, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి తదితరులు

కాకినాడ సిటీ: వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద జిల్లావ్యాప్తంగా గత ఏడాది అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 367 జంటలకు ప్రభుత్వం రూ.2.66 కోట్ల ఆర్థిక సాయం అందజేసిందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా నిధులను మంగళవారం బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ ప్రియంవద, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా, మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీతోఫా ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఆడ పిల్లలు పెద్ద చదువులు చదవాలన్న తపనతో ఈ పథకాలకు పదో తరగతి ఉత్తీర్ణత, వధువుకు కనీస వయోపరిమితి 18 ఏళ్లు, వరునికి 21 ఏళ్లుగా ప్రభుత్వం నిర్దేశించిందని చెప్పారు. పదో తరగతికి వచ్చేసరికి వారికి 15 ఏళ్ల వయసు వస్తుందని, ఇంటర్ వరకూ జగనన్న అమ్మ ఒడి పథకం కింద అందిస్తున్న ఏటా రూ.15 వేలు ఇస్తుండటంతో అమ్మాయిలకు 17 ఏళ్లు వచ్చేసరికి ఇంటర్ కూడా పూర్తవుతుందని చెప్పారు. దీంతో పాటు ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న వసతి దీవెన ద్వారా ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తూంటం, కల్యాణమస్తు, షాదీతోఫా ప్రోత్సాహకాలు కూడా ఉండటంతో పేదింటి ఆడపిల్లలు గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తారని వివరించారు. తద్వారా బాల్య వివాహాలకు కూడా అడ్డుకట్ట పడుతుందనే తాపత్రాయంతో ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోందని కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు. కల్యాణమస్తు, షాదీతోఫా పథకం లబ్ధిని ప్రతి త్రైమాసికం పూర్తయిన వెంటనే ప్రభుత్వం చెల్లిస్తోందని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు నమూనా చెక్కును ప్రజా ప్రతినిధులతో కలసి కలెక్టర్ అందజేశారు.

ఈఎస్ఎంఎస్‌తోనే ఎన్నికల నివేదికలు

కాకినాడ సిటీ: ఎన్నికల్లో ఈఎస్ఎంఎస్ మొబైల్ యాప్ ద్వారా మాత్రమే నివేదికలు పంపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికల నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఐటీ అప్లికేషన్స్ నిర్వహణపై కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో నివేదికలు మాన్యువల్‌గా పంపించేవారని, ఇకపై అన్నీ ఈఎంఎస్ఎస్ ద్వారానే జరుగుతాయని స్పష్టం చేశారు. ఈఎస్ఎంఎస్ నిర్వహణను ప్రతి ఒక్కరూ సక్రమంగా నేర్చుకోవాలని ఆదేశించారు. ఈఎస్ఎంఎస్ నిర్వహణకు ప్రతి ఎన్నికల అధికారికి ఒక లాగిన్ ఇస్తారని, దాని ద్వారానే ఆదేశాలు వస్తాయని, నివేదికలు కూడా పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఈఎస్ఎంఎస్ మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని, అధికారి హోదా, మొబైల్ నంబర్ తదితర వివరాలు నమోదు చేసి, లాగిన్ ప్రారంభించాలని సూచించారు. ఈఎస్ఎంఎస్‌ను ఎవరైనా దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ కృతికా శుక్లా హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి, కాకినాడ డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఐటీ నోడల్ అధికారులు, ఎస్ఐసీడీఐఓ సుబ్బారావు, పెద్దాపురం డీఎల్‌డీఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సెమినార్ హాల్, ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఆచార్య ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ఐఎస్‌టీలో కొత్తగా నిర్మించిన సెమినార్ హాలు, రూసా నిధులతో ఆధునీకరించిన వసతి గృహాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చదువుతో పాటు సమాంతరంగా మౌలిక సదుపాయలు కల్పించినప్పుడే విద్యార్థులు తగిన ప్రతిఫలం అందుకోగలరని అన్నారు. తరగతి గదులు, హాస్టళ్లను ఆధునీకరించి, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ విభాగాలతో పాటు నరేంద్ర హాస్టల్, నాగావళి హాస్టల్ ప్రారంభించామని ఆచార్య ప్రసాదరాజు చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్ గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏడుగురిని కాపాడిన కానిస్టేబుల్‌కు ఎస్పీ సన్మానం


కానిస్టేబుల్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏడుగురి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాసరావు ధైర్య సాహసాలను మెచ్చుకుని ఎస్పీ పి.జగదీష్ మంగళవారం పోలీసు కార్యాలయంలో సన్మానించారు. ఈ నెల 18న కోనసీమ, బెల్లంపూడి సెంటర్ వద్ద కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి కాల్వలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న నెల్లి శ్రీనివాసరావు వెంటనే స్పందించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాల్వలోకి దూకాడు. కారు డోర్లు తెరిచి లోపల ఉన్న చిన్న పిల్లలు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను బయటకు తెచ్చాడు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏడుగురు వ్యక్తుల ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావుకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి, ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్‌కుమార్, ఎల్.చెంచి రెడ్డి, ఆర్ఐ సంజీవ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ ఆకస్మిక మృతి


వెంకట నర్సమ్మ (ఫైల్)

అంబాజీపేట: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధీ హామీ పథకం పనులు చేస్తుండగా మహిళా కూలీ ఆకస్మికంగా మృతి చెందింది. ఉపాధి ఏపీఓ బొంతు చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగలకుర్రు అగ్రహారంలో మంగళవారం ఉపాధి పనులు చేస్తుండగా గ్రామానికి చెందిన గోసంగి వెంకట నర్సమ్మ (67) కళ్లు తిరుగుతున్నాయంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దాంతో అక్కడ ఉన్న తోటి ఉపాధి కూలీలు, స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది వెంకటనర్సమ్మ మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు విత్తనాల దుర్గాభవాని, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కమనీయం భీమనాథుని కల్యాణం


కల్యాణాన్ని కనులారా తిలకిస్తున్న భక్తజనం


వైభవంగా మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వార్ల కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి వేణు దంపతులు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఎక్కడా లేని విధంగా మూల విరాట్ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారితో పాటు క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణ స్వామి, ఛండికా సమేత సూరేశ్వరస్వామివారి దివ్య కల్యాణాన్ని ఒకే వేదికపై తిలకించి భక్తులు పరవశులయ్యారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు నేతృత్వంలో స్వామి వార్ల కల్యాణం పురస్కరించుకుని విశేష పుష్పాలంకరణలు చేయడంతో ఆలయం శోభాయమానంగా అలరించింది. దేవస్థానం బ్రహ్మ


పెళ్లి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి వేణు దంపతులు

దేవులపల్లి ఫణిరామకృష్ణ, ఆలయ అర్చకులు, దేవస్థానం వైదిక బృందం ఆధ్వర్యంలో ఉదయం కల్యాణమూర్తులను గావించిన అనంతరం ఆలయంలో ఎదురు సన్నాహాలతో కల్యాణం ప్రారంభమైంది. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం గావించారు. నంది వాహనంపై స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆరుద్రా నక్షత్రయుక్త తులా లగ్నంలో రాత్రి 10.25 గంటలకు శిరస్సులపై జీలకర్ర, బెల్లం ఉంచారు. తదుపరి మాంగళ్యధారణ చేయించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, నీరాజన మంత్రపుష్పాల సమర్పణతో కల్యాణం ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి భీమనాధుని కల్యాణాన్ని కనులారా తిలకించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి వేణు దంపతులు

ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పెండ్లి పట్టు వస్త్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సతీమణి వరలక్ష్మి సమేతంగా తలపై పెట్టుకుని సంప్రదాయబద్ధంగా కల్యాణ వేదిక వద్దకు తీసుకుని వచ్చి అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు.


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి


జి.మామిడాడలోని సూర్యదేవుని కల్యాణ క్రతువుల్లో భాగంగా తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

వైభవంగా ఆదిత్యుని పరిణయం

పెదపూడి: గోవిందనామ స్మరణ నడుమ...ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల సందడితో స్వామివారి కల్యాణం నయన మనోహరంగా సాగింది. మధ్యాహ్నం 1.05 గంటలకు స్వామి వారి రథోత్సవాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ప్రారంభించారు. దేశంలోనే ఏకైక వైష్ణవ సంప్రదాయ సూర్యదేవాలయంగా మండలంలోని జి.మామిడాడ గ్రామంలోని సూర్యదేవాలయం ప్రసిద్ధిగాంచింది. ఈ ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినాన మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసా బాలకృష్ణారెడ్డి, దేవదాయ శాఖ తరపున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో 20 మంది పండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణ క్రతువు నిర్వహించారు. రాత్రి 8.30 గంటల సుముహూర్తంలో స్వామివారి కల్యాణం కడు రమ్యంగా జరిగింది. ఆలయ ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జాము 3.30 గంటల నుంచే స్వామివారిని మెల్కొలిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11.30 గంటలకు ఆలయంలోని ఉత్సవ మూర్తులను ఆలయం బయట ఉన్న రథం వద్దకు పల్లకీలో ఉంచి తీసుకొచ్చారు. అర్చకులు ఉత్సవ మూర్తులను మంత్రోచ్ఛరణలతో రథంలో ఆసీనులను చేశారు. మధ్యాహ్నం 1.05 గంటలకు స్వామి వారి రథోత్సవం ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ఘనంగా ప్రారంభించారు.

అడిషనల్ ఎస్పీ భాస్కరరావు సందర్శన

కాకినాడ జిల్లా అడిషనల్, అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, కాకినాడ డీఎస్పీ డాక్టర్ కె.హనుమంతరావు జి.మామిడాడలో కల్యాణం, రథోత్సవం ఏర్పాట్లను పరిశీలించి కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు, స్థానిక ఎస్సై శోభన్‌కుమార్‌కు బందోబస్తు సంబంధించి పలు సూచనలు చేశారు.

పుట్టకొండలో రథోత్సవం


పుట్టకొండలో వైభవంగా జరుగుతున్న రథోత్సవం

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ రథోత్సవం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఘనంగా జరిగింది. రథోత్సవాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు. శతాబ్దాల చరిత్ర, ప్రాధాన్యం కలిగిన వల్మీకాద్రి ఉగ్రనరసింహ స్వామిగా లక్ష్మీ నరసింహుడు ప్రసిద్ధి చెందాడు. కల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 8.10 గంటలకు స్వామివారికి నిత్యహోమం, సంప్రదాయార్చన, 12 గంటలకు ధ్వజారోహణం, బలిహరణం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం జరిగింది. రాత్రి 10 గంటలకు గరుడ సేవ, పుష్పక వాహన సేవ చేశారు. 12 గంటలకు సముద్ర మహర్షి సంవాదం మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం తెల్లవారు జామున 4 గంటలకు (బుధవారం) స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. కల్యాణం భీష్మ ఏకాదశీ పర్వదినం సందర్భంగా ఉగ్ర నరసింహస్వామి వారికి ప్రధాన అర్చకులు పి.గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పీవీ అనంతాచార్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి సీహెచ్.వీ.రమణమూర్తి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. పండితులు కల్యాణ క్రతువులను నిర్వహిస్తారు. అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కేతా తులసి, సర్పంచి వల్లు వెంకటరమణ, హితకారిణీ సమాజం డైరెక్టర్ వుంద్రు సత్యనారాయణ, ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, పార్టీ నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, తాడాల మణికంఠ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో సాగుతున్న జనార్దనస్వామి రథోత్సవం (అంతర చిత్రం) స్వామి అమ్మవార్లు

మార్మోగిన గోవింద నామస్మరణ

రథోత్సవంలో పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ధవళేశ్వరం గ్రామంలోని ధవళగిరి గోవింద నామస్మరణతో పులకించింది. చూసిన కనులదే వైభోగం అన్నట్లు సాగింది నవజనార్దనుల్లో ప్రథముడైన ధవళగిరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీజనార్దనస్వామివారి రథోత్సవం ,కల్యాణోత్సవం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున స్వామి వారికి విశేష అర్చనలతో శ్రీలక్ష్మీ జానర్దనస్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం రథ సంప్రోక్షణ, మధ్యాహ్నం 3.30 గంటలకు రథోత్సం, అనంతరం ధ్వజారోహణ, అంకురార్పణ, వాస్తుపూజ, రాత్రి స్వామివారి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం స్వామివారి రథాన్ని సతీసమేతంగా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ లాగారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీజనార్దనస్వామివారిని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ,వరలక్ష్మీ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ,రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తులు స్థానిక రామపాద క్షేత్రంలో పుణ్య స్నానాలు ఆచరించి జనార్దన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రథోత్సవంలో పాల్గొన్న విదేశీయులు సెల్‌ఫోన్‌లో రథోత్సవాన్ని చిత్రీకరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగసురేష్, పంచాయతీ కార్యదర్శి డి.నూరిబాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ హెల్త్ వర్సిటీ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

రాజానగరం: వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ స్థాయిలో స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ (మెన్) పోటీలను కళాశాల చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు మంగళవారం ప్రారంభించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ పోటీలలో యూనివర్సిటీ పరిధిలోని మెడికల్ అండ్ డెంటల్ కళాశాలలకు చెందిన 42 టీమ్‌లు పాల్గొంటున్నాయి. నాకౌట్ పద్ధతిలో 25 ఓవర్లలో పోటీలు జరుగుతాయని డాక్టర్ గన్ని తెలిపారు.


జీఎస్ఎల్‌లో ప్రారంభమైన యూనివర్సిటీ స్థాయి క్రికెట్ పోటీలు

రాత్రి వేళలో కూడా ఆడే విధంగా ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు 16 జట్లు పాల్గొన్నాయని యూనివర్సిటీ స్పోర్ట్సు కౌన్సిల్ కార్యదర్శి త్రిమూర్తులు తెలిపారు.

సిబార్ డెంటల్ కాలేజీ జట్టుపై సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజ్ జట్టు, నారాయణ డెంటల్ కాలేజీ జట్టుపై గుంటూరు మెడికల్ కాలేజీ జట్టు, విజయవాడ ప్రభుత్వ డెంటల్ కాలేజ్ జట్టుపై కర్నూల్ విశ్వభారతి మెడికల్ కాలేజ్ జట్టు, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ జట్టుపై కర్నూలు మెడికల్ కాలేజీ జట్టు విజయం సాధించాయన్నారు.

కష్టపడిన స్థానికులకే టీడీపీ టిక్కెట్ ఇవ్వాలి

పి.గన్నవరం నియోజకవర్గంలో మూడు ముక్కలాట

మామిడికుదురు: కష్టపడిన స్థానికులకే పి.గన్నవరం టీడీపీ టిక్కెట్ కేటాయించాలని నగరంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ ఎస్సీ సెల్ సమావేశం తీర్మానించింది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఈ సీటును తమకే కేటాయించారంటూ జనసేన నాయకులు ఒక వైపు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పి.గన్నవరం టికెట్‌ను స్థానికులకే కేటాయించాలని నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ సమావేశం తీర్మానించడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఈ సీటు ఏ పార్టీకి కేటాయిస్తారో తెలియని అయోమయంలో ఉండగా, మధ్యలో మేమూ తగ్గేదిలేదంటూ బీజేపీ నేతలు రంగంలోకి దిగారు. ఈ పరిణామాల నేపథ్యంలో పి.గన్నవరం నియోజకవర్గ రాజకీయ పరిస్థితి మూడు ముక్కలాటగా మారిందని చర్చించుకుంటున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, మరొకరికి రూ.10వేల జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు ఇచ్చినట్టు ఎస్సై మౌనిక మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించి మంగళవారం కోర్టుకు హాజరు పర్చామన్నారు. కిర్లంపూడికి చెందిన వేమగిరి లోవరాజుకు రెండు రోజుల జైలు శిక్ష, కాకినాడకు చెందిన భూసా శ్రీనుకు రూ.10 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు.

గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు: ఔరంగాబాద్ ఇసుక ర్యాంపు సమీపంలో గోదావరి నదిలో మంగళవారం నార్కెడ్‌మిల్లి ప్రవీణ్(29) మృతదేహం లభ్యమైంది. సోమవారం రోడ్డు కం రైలు వంతెనపై మోటారు సైకిల్ పెట్టి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టు మార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సౌమ్యత శ్యాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతుడికి వివాహం కాలేదన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారని సీఐ తెలిపారు.

'నన్నయ'కు రూ.20 కోట్ల పీఎం ఉష నిధులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ (పీఎం – ఉష) పథకంలో రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. యూనివర్సిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవన్‌లో ఈ పథకానికి సంబంధించిన లైవ్ కార్యక్రమాన్ని మంగళవారం వీక్షించిన అనంతరం వీటి వివరాలను వీసీ ఆచార్య కె. పద్మరాజు తెలియజేశారు. పీఎం – ఉష పథకంలో 78 ప్రాజెక్టులకు రూ.3,600 కోట్లకు పైగా కేటాయించే బడ్జెట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ్ము కాశ్మీర్ నుంచి ప్రకటించారన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగపడే ఈ నిధుల కోసం పలు యూనివర్సిటీలు పోటీ పడగా 'నన్నయ'కు రూ.20 కోట్లు మంజూరు కావడం హర్షణీయమన్నారు. యూనివర్సిటీ చరిత్రలో తొలిసారిగా పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం ఆనందదాయకమన్నారు. ఈ నిధులలో రూ.10 కోట్లతో యూనివర్సిటీలో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ కోసం మల్టీపర్పస్ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మిగిలిన రూ. 10 కోట్లతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ పీఎం – ఉష పథకంలో నిధులు పొందేందుకు రాష్ట్రంలో ఉన్న యూనివర్సిటీలన్నీ పోటీ పడినా, 'నన్నయ'కే దక్కడం గొప్ప విషయమన్నారు. దీనిలో వీసీ ఆచార్య పద్మరాజు కృషి ఉందంటూ అభినందనలు తెలిపారు. ఇప్పటికే ఖేలో ఇండియా నుంచి వచ్చిన రూ. 8 కోట్ల నిధులతో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.పద్మరాజు, ఈసీ మెంబర్ గంధం నారాయణరావు, రాజమహేంద్రి కాలేజ్ చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆదిత్య కాలేజీ యాజమాన్య ప్రతినిధి డాక్టర్ సుగుణ, అలోమ్ని అసోసియేషన్ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పీఎం – ఉష పథకం బడ్జెట్ ప్రకటనను లైవ్‌లో తిలకిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు, ఎంపీ మార్గాని, తదితరులు

సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుంటూరు జిల్లా గుంటూరులోని ఆర్.అగ్రహారం పేటకు చెందిన ఆలపాటి సాంబశివరావు(85), 2019లో బాలికపై అత్యాచారానికి పాల్పడి జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 2021 జూలై 3వ తేదీన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి చేర్చారు. అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 13వ తేదీన జైలు అధికారులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు అదే రోజు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాంబశివరావు మంగళవారం మృతి చెందగా కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మాతా శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు

డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: మాతాశిశు మరణాలుల సంభవించకుండా భవిష్యత్తు కార్యాచరణతో వైద్యులు, వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆయన మాతా శిశు మరణాలపై వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరమన్నారు. వైద్యులు చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అవసరం మేరకు నిపుణులతో చర్చించాలని సూచించారు. ప్రతి నెలా మాతాశిశుమరణాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపీసీడీఎస్ఆర్ జిల్లా కమిటీ సభ్యులు హాజరై సూచనలు, సలహాలు అందజేశారు. శంభు నగర్, రంగంపేట, జి.కొత్తపల్లి దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జనవరి మాసంలో జరిగిన మరణాలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ సనత్ కుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.రాజకుమారి, గైనకాలజిస్ట్ డాక్టర్ శైలజ, అనస్థీషియా డాక్టర్ మహేంద్ర, పీడియాట్రీషిన్ డాక్టర్ ఝాన్సీ పద్మ, రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, కొవ్వూరు డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చైతన్య, డాక్టర్ మౌనిక, డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ , డాక్టర్ షమ్మి కుమార్, ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అరుణకుమారి , డీపీహెచ్ఎన్‌వో జి.వసంతలక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటి శ్రీలీల


కాకినాడ నీరూస్ షోరూమ్ ప్రారంభిస్తున్న సినీ నటి శ్రీలీల

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలో నీరూస్ షోరూమ్ ప్రారంభోత్సవంలో సినీ హీరోయిన్ శ్రీలీల మంగళవారం పాల్గొన్నారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. హలో కాకినాడ ఎలా ఉన్నారు..అంటూ హీరోయిన్ శ్రీ లీల పలకరించారు.

ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పలు రకాల వస్త్రాలు నగరవాసులను ఎంతగా ఆకట్టుకునే విధంగా ఉన్నాయని కుటుంబ సమేతంగా నీరూస్ షోరూమ్‌కు రావాలని ఆమె నగరవాసులను కోరారు. షోరూమ్ ఎండీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ స్త్రీలు, పిల్లలకు కావాల్సిన అందమైన అన్ని రకాలు వస్త్రాలు లభిస్తాయన్నారు. నీరూస్ 1971నుంచి భారతీయ మహిళలను ఎత్నిక్ వేరుతో ఆకర్షించడం జరుగుతుందన్నారు. కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి పాల్గొన్నారు.